


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 30-08-2026 సంపుటి : 08 సంచిక 73 పేజీలు : 8 వెల : రూ 3-00




# మధ్య ఆసియాపై భారత్ ఫోకస్..

## మోదీ కీలక పర్యటన

న్యూఢిల్లీ , మధ్య ఆసియాలో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల పర్యటనకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లలో ఆయన పర్యటించనున్నారు. తొలుత తాష్కెంట్ చేరుకోనున్న మోదీ.. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. అనంతరం బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు.మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించడమిది నాలుగోసారి. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగనున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై ఇరుదేశాల నేతలు సమీక్షించనున్నారు. భారత్ 'వికసిత్ భారత్ 2047', ఉజ్బెకిస్థాన్ 'ఉజ్బెకిస్థాన్-2030' అభివృద్ధి లక్ష్యాల మధ్య సహకారానికి ఉన్న అవకాశాలపైనా చర్చించనున్నారు. కాగా.. మధ్య ఆసియాలో భారత్‌కు ఉజ్బెకిస్థాన్ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. వాణిజ్యం, ఇంధనం, ఆరోగ్యం, ఔషధాలు, వ్యవసాయం, రసాయనాలు, యంత్ర పరికరాలు తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.ఈ పర్యటనలో భాగంగా తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, మహాత్మా గాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు. ఆ తర్వాత కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగే ఎస్‌సీఓ సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే మూడు అంశాలను భారత్ కీలకంగా ప్రస్తావించనున్నారు. ఈ ఏడాది 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటున్న ఎస్‌సీఓలో.. భారత్ 2017 నుంచి పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఈ సదస్సు సందర్భంగా పలు దేశాధ్యక్షులతో ద్వైపాక్షిక భేటీలూ జరిగే అవకాశముంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ సమావేశం కూడా ఖరారైనట్లు సమాచారం.

# సంజీవని గేమ్ చేంజర్‌గా మారుతుంది: సీఎం చంద్రబాబు



అల్లూరి జిల్లా , ఆగస్టు 29 : రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా సంజీవని వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదని.. పిల్లలే మన సంపద అని తెలిపారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. గన్నెలలో సంజీవని ప్రాజెక్ట్‌ను, ఆరోగ్య రథాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. అల్లూరి జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించుకుంటున్నామని తెలిపారు.గతంలోనే ఆయుర్వేద వైద్యాన్ని గిరిజనులకు అల్లూరి సీతారామరాజు అందించారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టామని వెల్లడించారు. థింసా డాన్స్‌తో గిరిజన బిడ్డలు గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారని ప్రశంసించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదనేది తన సంకల్పమని ఉద్ఘాటించారు. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు.ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 104 వాహనాల ద్వారా సంచార వాహనాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్- 3 మేమే తీసుకువచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తాం. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం. అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశాం. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోం స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# నమ్మకద్రోహిని అయితే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని: విజయసాయిరెడ్డి

అమరావతి, ఆగస్టు 29: వైసీపీలో తనపై జరుగుతున్న ప్రచారానికి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. నమ్మకద్రోహిని అయితే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని అని అన్నారు. తనపై వైసీపీకి చెందిన 'కోటరీ' నాయకులు సోషల్ మీడియాలో నమ్మకద్రోహి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. తాను జగన్‌కు నమ్మకస్తుడిగా ఉన్నందుకే కాంగ్రెస్ ప్రభుత్వం తనను జగన్‌తో పాటు పలు అఃఎ, ఇఆ చార్జ్‌షీట్లలో ం2గా చేర్చిందని పేర్కొన్నారు. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే, తాను 15 నెలలు జైలు జీవితం గడిపానని, తనలో



నమ్మకద్రోహం ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడినని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల తర్వాత తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్ కేసులో ం5గా, కాకినాడ సీ పోర్ట్ కేసులో ం2గా చేర్చారని విజయసాయి ఆరోపించారు.2019 ఎన్నికల తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం పార్టీలో పెరిగిందని.. ఆయన రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారని విజయసాయిరెడ్డి విమర్శించారు. జగన్‌ను ఎవరూ కలవకుండా అడ్డుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు ఆయనకు దూరం కావడానికి కూడా సజ్జలే కారణమని ఆరోపించారు. 'కోటరీ' నాయకుడి వల్ల అవమానాలు భరించలేక.. ఆత్మగౌరవాన్ని చంపుకొని పార్టీలో కొనసాగలేక రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని చెప్పారు. జగన్‌కు వెన్నుపోటు పొడిచి కేసులు లేకుండా చేసుకోవడం తనకు తెలియదని, కోవర్టు రాజకీయాలు తనకు చేతకావని స్పష్టం చేస్తూ.. 'కోటరీ' నాయకుడి చేతిలో జగన్ బందీ అయ్యారని విజయసాయి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.






# ఉద్యోగులను రెచ్చగొట్టేలా బొప్పరాజు వ్యవహరిస్తున్నారు: మంత్రి అనగాని

అమరావతి, ఆగస్టు 29 : ఏపీ జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు వైఖరిపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని తెలిపారు. ఈ సమయంలో ఉద్యోగులను రెచ్చగొట్టేలా బొప్పరాజు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వెలగపూడిలోని సచివాలయంలో మీడియాతో మంత్రి అనగాని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలే అజెండాగా బొప్పరాజు పనిచేస్తున్నారా...? లేక పొలిటికల్ అజెండాతో పని చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. బొప్పరాజు వ్యవహార శైలిపై పలు అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఉద్యోగులకు - ప్రభుత్వానికి ఉన్న సఖ్యతను చెడగొట్టడానికి బొప్పరాజు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.జగన్ హయాంలో పెట్టిన బకాయిలనూ కూటమి ప్రభుత్వమే పెట్టిందనే రీతిలో బొప్పరాజు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి అనగాని ఆగ్రహించారు. రెండేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన నిధుల గురించి కనీసం ప్రస్తావించకపోవడం చూస్తుంటే బొప్పరాజు ఆలోచనా ధోరణి ఏంటో అర్థమవుతోందని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై బొప్పరాజుతో సహా వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఆర్థిక కష్టాలున్నా... ప్రభుత్వం ఉద్యోగ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలోని పెండింగ్ బిల్లులను చాలా వరకు చెల్లించామని అన్నారు.. ఇంకా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం వర్తింపచేశామని స్పష్టం చేశారు. సీపీఎస్ కాంట్రిబ్యూషన్‌ను వైసీపీ హయాంలో సొంత అవసరాలకు వాడుకుంటే... తిరిగి వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.ఉద్యోగుల ఖాతాల్లోని సొమ్మును కూడా జగన్ హయాంలో తమ



అవసరాలకు వాడుకున్నారని మంత్రి అనగాని మండిపడ్డారు. వాటిని తిరిగి ఉద్యోగుల ఖాతాల్లో తాము వేశామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ తాము చెల్లించామని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ఇంకా చాలా చేశామని అన్నారు. విడతల వారీగా వేల కోట్లు ఉద్యోగుల బకాయిల నిమిత్తం చెల్లిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను తాము గౌరవిస్తున్నామని, చర్చలు జరుపుతున్నామని అన్నారు. జగన్ హయాంలో రివర్స్ పీఆర్సీ ఇచ్చారని.. జీతాల్లో నుంచి రికవరీ పెట్టారని... ఇలాంటి వాటిని బొప్పరాజు మరిచారో.. మరిచినట్లుగా నటిస్తున్నారోనని ఎద్దేవా చేశారు.జగన్ హయాంలోని పాపాలను కూడా కూటమి ప్రభుత్వం ఖాతాలో వేసి బొప్పరాజు ఉద్యోగులను తప్పుదారి పట్టిస్తున్నారని మంత్రి అనగాని మండిపడ్డారు. బొప్పరాజు వ్యవహారశైలిని ఉద్యోగులూ గమనించాలని కోరారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న పనులను అడ్డుకునేలా బొప్పరాజు వ్యవహార శైలి ఉందని ఆగ్రహించారు. ఉద్యోగుల అజెండా కంటే.. పొలిటికల్ అజెండానే బొప్పరాజు అమలు చేస్తున్నట్లుగా కన్పిస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబును అవమానించేలా, అవహేళన చేసేలా బొప్పరాజు సభ నిర్వహించారని మండిపడ్డారు. ఉద్యమాలు చేయడాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని సహిస్తాం కానీ... కుట్ర పూరితంగా సీఎంను అవహేళన చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బొప్పరాజుతో సహా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో జగన్ ఏ విధంగా వ్యవహరించారో... చంద్రబాబు ఏ విధంగా వ్యవహరిస్తున్నారో ఉద్యోగులు గమనించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 30-08-2026

## రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు

హిమాలయాలు అంటే మంచు కొండలు. గ్లేషియర్లు. ప్రపంచంలోని కోట్లాది మందికి జీవనాధారం అందించే నదుల పుట్టినిల్లు. కానీ ఇప్పుడు ఇదే హిమాలయ ప్రాంతం వాతావరణ మార్పులతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. మంచు వేగంగా కరుగుతోంది. గ్లేషియర్లు వెనక్కి తగ్గుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న హిమ సరస్సులు ఉబ్బిపోతున్నాయి. కొండచరియలు, మంచు చరియలు విరిగిపడి..ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఘోర వరదలు ఈ ప్రమాద తీవ్రతను మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.హిమాలయాల్లో మంచు కరుగుతోంది. కొండలు అస్థిరమవుతున్నాయి. హిమ సరస్సులు పెరుగుతున్నాయి. ఆకస్మిక వరదల ముప్పు విస్తరిస్తోంది. నేపాల్–టిబెట్ సరిహద్దులో తాజా విషాదం ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించిన ఘటన కాదు. హిమాలయాలు వేడెక్కితే.. ఆ ప్రభావం పర్వతాల నుంచి మైదానాల వరకు.. నదుల నుంచి కోట్లాది ప్రజల జీవనంపై పడే అవకాశం ఉంది. హిమాలయాల్లో వరద పుట్టేది ఎత్తైన పర్వత ప్రాంతాల్లో.. మొదటి దెబ్బ తగిలేది గ్లేషియర్ దిగువన ఉన్న నదీ లోయలకు.. ఆ తర్వాత నదీ తీర గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి.. చివరికి నది ప్రవాహం దిగువ మైదాన ప్రాంతాలకు చేరుతుంది.అందుకే వరద పుట్టేది పర్వతాలపై.. మొదటి దెబ్బ నదీ లోయలకు.. తర్వాత నదీ తీర గ్రామాలకు.. చివరికి దిగువ మైదాన ప్రాంతాలకు అనే ప్రమాద గొలుసును ముందుగానే అర్థం చేసుకోవాలి.హిమాలయాల్లో వచ్చే వరదలకు భారతదేశంలో ప్రధానంగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు నేరుగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే వరద నీరు నదుల వెంట దిగువకు ప్రవహించడంతో పశ్చిమ బెంగాల్, అసోం వంటి మైదాన రాష్ట్రాలపైనా ప్రభావం పడొచ్చు.టిబెట్‌లో పుట్టే అనేక నదులు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి వచ్చిన తర్వాత సియాంగ్‌గా.. ఆపై అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. మరోవైపు తీస్తా వంటి నదులు సిక్కిం, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల హిమాలయాల్లో వరద అంటే పర్వత ప్రాంతానికే పరిమితమైన సమస్య కాదు.. నదీ ప్రవాహం ఎక్కడివరకు వెళ్తుందో అక్కడివరకు ముప్పు విస్తరించే అవకాశం ఉంటుంది.నష్టం ఎంత ఉంటుందనేది వరద పరిమాణం, నది వెడల్పు, లోయ ఆకారం, దిగువన ఉన్న జనాభా, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగడంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఈ విపత్తులో ప్రాణ నష్టం సంభవించడంతో పాటు వంతెనలు, రహదారులు, భవనాలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1,200 మెగావాట్ల తీస్తా–ఎఎఎ జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు.చమోలీలో సంభవించిన ఆకస్మిక వరదలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు లేదా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, నదీ లోయల్లోని మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ రెండు ఘటనలు చెబుతున్న సందేశం ఒక్కటే?ప్రాణ నష్టంతో పాటు విద్యుత్, రవాణా, వ్యవసాయం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలపైనా భారీ ప్రభావం పడుతుంది.నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు, మట్టి ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. గ్లేషియర్‌లోని మంచు, రాళ్లు ఒక్కసారిగా కూలిపోయి భారీ నీటి ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. భోటే కోసి నది లోయలోకి దూసుకొచ్చిన వరదలు గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో విదేశీయులు, పర్యాటకులు, యాత్రికులు కూడా ఉన్నారు.ఈ ఘటనకు భూకంపమే కారణమన్న తొలినాటి అనుమానాలను తర్వాతి పరిశీలనలు బలపరచలేదు. గ్లేషియర్ కూలిపోవడం, మంచు–రాళ్ల ప్రవాహం, నదిలో ఒక్కసారిగా భారీ నీటి ఉద్ధృతి కలిసి ఈ విపత్తుకు కారణమైందని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహాయక చర్యలకు కూడా పెద్ద అవరోధంగా మారాయి.హిమాలయాల్లో ఇటువంటి విపత్తులు గతంలోనూ వచ్చాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో మంచు–రాళ్ల ప్రవాహం, వరదలతో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగి గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2024లో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలతో వందల మంది మరణించారు. అదే ఏడాది నేపాల్‌లోని థామే ప్రాంతంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ వచ్చి ఇళ్లు, హోటళ్లు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సహా అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 2025లోనూ నేపాల్–టిబెట్ సరిహద్దులో భారీ వరదలు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి.హిమాలయాల ఎత్తు ప్రాంతాన్ని బట్టి భారీగా మారుతుంది. పర్వత పాద ప్రాంతాలు కొన్ని వందల మీటర్ల ఎత్తులో ఉండగా.. ఎత్తైన హిమాలయ ప్రాంతాల్లో 5,000 నుంచి 6,000 మీటర్లకు పైగా ఎత్తులు సాధారణం. ఎవరెస్ట్ వంటి శిఖరాలు 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.భారత్‌లోని హిమాలయ రాష్ట్రాల్లో అనేక పట్టణాలు, గ్రామాలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు నదీ లోయలకు సమీపంలోనే ఉన్నాయి.

# ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ

హైదరాబాద్ ఆగస్టు 29, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. వెంటనే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి.. రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఐఎం ప్రకటించిన వివరాల ప్రకారం.. మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించారు. అయితే ఆయనపై ఇంత కఠిన చర్య తీసుకోవడానికి దారితీసిన వీడియో లీక్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. దీంతో అసలు వ్యవహారం ఏమిటన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.రహ్మత్ బేగ్‌పై పార్టీ చర్యలకు వీడియో లీక్ వ్యవహారమే కారణమని ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పలు ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. ఇటీవలే రహ్మత్ బేగ్ తనపై డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను బయటపెడతామంటూ కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి.ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే ఎంఐఎం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించడం మరింత ఆసక్తిని రేపుతోంది. అయితే డీప్‌ఫేక్ బెదిరింపుల కేసు, పార్టీ బహిష్కరణ నిర్ణయానికి నేరుగా సంబంధం ఉందని ఎంఐఎం అధికారికంగా ప్రకటించలేదు. 2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి మీర్జా రహ్మత్ బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2029 మే వరకు కొనసాగాల్సి ఉంది. అయితే పార్టీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆదేశాల మేరకు మండలి చైర్మన్‌కు మీర్జా రహ్మత్ బేగ్ రాజీనామా సమర్పిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇక రహ్మత్ బేగ్ ఇటీవల సౌదీ అరేబియాకు వెళ్లినట్లు.. అక్కడి నుంచి పార్టీ ఆదేశాల నేపథ్యంలో తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయనను ఎందుకు అత్యవసరంగా హైదరాబాద్‌కు రప్పించారనే విషయంపై అధికారికంగా స్పష్టత లేదు. కూడా పార్టీ నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.మొత్తంగా ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ, ఆయనకు పార్టీ నుంచి వచ్చిన రాజీనామా ఆదేశాలు, మరోవైపు డీప్‌ఫేక్ వీడియోల పేరుతో వచ్చిన బెదిరింపులు ప్రస్తుతం హైదరాబాద్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో వైరల్ అవుతున్న ఆరోపణలను వాస్తవాలుగా పరిగణించకుండా.. పార్టీ అధికారిక ప్రకటనలు, పోలీసుల దర్యాప్తు ఆధారంగా మాత్రమే తదుపరి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...



హైదరాబాద్ ఆగస్టు 29, (న్యూస్ పల్స్) బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ–ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత–హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

# రూ.22 వేల కోట్ల అప్పు చేశా.. అయినా తగ్గేదే లే.. మళ్లీ సంపాదిస్తా..!

ఒకప్పుడు దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర .. తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఆయన దాదాపు రూ.22,006 కోట్ల అప్పుచేశారు. కేవలం రూ.6.5 కోట్లు తిరిగి చెల్లించేలా సెటిల్‌మెంట్ చేసుకున్నారు. ఈ మేరకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ రుణ పరిష్కార ప్రణాళికను ఆమోదించింది. ఈ నేపథ్యంలో ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు.ఆయన తీసుకున్న అప్పు మొత్తంలో రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ



తరుణంలో సుభాష్ చంద్ర తన భవిష్యత్ ప్రణాళికలను ధైర్యంగా ప్రకటించారు. "నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నాకు మిగిలిన చివరి రూ.6.5 కోట్లు అప్పును కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి, వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తాను" అని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. స్విట్జర్లాండ్‌లో కొత్త పని చేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.2–4 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉంది" అని ఆయన పేర్కొన్నారు.ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం.. రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ.. సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.

# ఆ షాకింగ్ వీడియో చైనాలో నిషేధం..

కాట్మాండు : ప్రకృతి విరుచుకుపడితే ఎలా ఉంటుందో నేపాల్ వరదలు చాటిచెప్పాయి. ఆ మహావిలయం సంభవించినప్పుడు నేపాల్, టిబెట్ బోర్డర్‌లో ఉన్న గిరాంగ్ పోర్ట్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ ఆ శక్తివంతమైన వరదలకు సాక్ష్యంగా నిలిచింది. అత్యంత బలమైన బండరాళ్లు, బురద, నీరు ఆ సెంటర్‌పై విరుచుకుపడింది. ఆ వరద ధాటికి అక్కడ ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన జనం ఆ ప్రవాహంలో కన్నుమూశారు. కొండల మధ్య మహోగ్రంగా బురద నీరు మహా ప్రళయం సృష్టించింది. అయితే గిరాంగ్ పోర్ట్ వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాలకు ఆ ప్రకృతి పంజా చిక్కిన విషయం తెలిసిందే.ప్రపపంచ దేశాలన్నీ ఆ వీడియోను వీక్షించాయి. కానీ డ్రాగన్ దేశం చైనాలో మాత్రం ఆ వీడియోపై నిషేధం ఉన్నది. ఇప్పటికే వరకు ఆ దేశంలో ఈ వీడియోను పబ్లిక్‌గా ప్రదర్శించలేదు. కేవలం ఒకే ఒక్క స్టిల్ ఫ్రేమ్ షాట్ మాత్రమే చైనా మీడియాలో ప్లే చేస్తున్నారు. అక్కడి న్యూస్ బులిటెన్‌లో కూడా ఈ ఫ్రేమ్‌నే రిపీట్ చేస్తున్నారు. కఠినమైన సెన్సార్‌షిప్ ఉన్న చైనా ఇంటర్నెట్‌లో అసలు ఆ వీడియో ఆచూకీ లేదు. ఆకస్మిక వరదలకు చెందిన పోస్టులను అక్కడ సోషల్ మీడియాలో నిషేధించారు.వాస్తవానికి వరదలు వచ్చిన కొన్ని గంటల్లో చైనా సర్కారు భారీ రెస్క్యూ ఆపరేషన్‌కు ఆదేశాలు ఇచ్చింది. వరద విలయం చోటుచేసుకున్న తర్వాత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

## ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద ఆయిల్ డీల్.. వెనిజువెలాతో ఒప్పందంపై ట్రంప్ ప్రకటన



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద ఇంధన ఒప్పందం కుదిరినట్లు ఆయన పేర్కొన్నారు. వెనిజువెలా దేశంతో ఆ డీల్ కుదిరినట్లు వెల్లడించారు. ట్రుత్ సోషల్ అకౌంట్‌లో ఆయన ఈ ప్రకటన చేశారు. ఒకవేళ అన్నీ అనుకూలిస్తే దక్షిణ అమెరికా దేశంలోని ఇంధన నిక్షేపాలను అమెరికా వినియోగించుకోనున్నట్లు చెప్పారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హేగ్సెత్, వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ చర్చల్లో ఆ డీల్ కుదిరినట్లు పేర్కొన్నారు.ఈ డీల్‌లో భాగంగా 17 ఆయిల్ ఫీల్డ్స్‌ను డెవలప్ చేయనున్నట్లు వెనిజువెలా అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. సుమారు 65 బిలియన్ల బ్యారెళ్ల ఇంధనం వెలికితీసే అవకాశాలు ఉన్నాయి. వెనిజువెలా ఆయిల్ ఇండస్ట్రీలోకి సుమారు వంద బిలియన్ల డాలర్ల పెట్టుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం వల్ల పన్నుల రూపంలో సుమారు 209 బిలియన్ల డాలర్లు వసూల్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు వెనిజువెలా సర్కారు తెలిపింది.

## బీఆర్ఎస్ అని.. నన్ను మట్టి కొట్టనిస్తలేరు.. నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచ్ ఆవేదన

తిమ్మాజిపేట, ఆగస్టు 28 : 'మొరం కొట్టనిస్తలేరు.. కొట్టాలంటే అనుమతి కావాలంట.. అడిగితే అధికారులు ఇస్తలేరు'.. అం టూ నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మం డలం మరికల్ సర్పంచ్ రమాదేవి ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ రహదారులు గుంతలమయంగా మారాయని, మురుగు ప్రాంతా ల్లో మట్టి కొట్టి చదును చేద్దామంటే అనుమతి ఇస్తలేరని వాపోయారు. శుక్రవారం వీధుల్లో ఉన్న మురుగుగుంతలను ఉసర్పంచ్ వెంకటయ్యతో కలసి ఆమె మీడియాకు చూపించారు.వర్షాల కారణంగా రోడ్లు దుర్గంధభరితంగా మారి స్థానికులు ఇబ్బందులు పడ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ శివారులో మట్టిని తీసుకుందామంటే అధికారులు అనుమతి ఇవ్వ డం లేదని ఆరోపించారు. గ్రామస్తులు సమస్యను తన దృష్టికి తీసుకొస్తున్నా.. ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నానని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి సర్పంచ్‌గా గెలిచినందుకే తనను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

జనసేన పార్టీ

కాకినాడ, ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది. మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# అనిల్ లో నిర్వేదం..



నెల్లూరు, ఆగస్టు 29, పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలువోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది. ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

ఒంగోలు, ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు. టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రామిక నీరు సరఫరా కానుందిఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

# హీట్ పుట్టిస్తున్న పులివెందుల

కడప ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు




గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. నియోజకవర్గంలో చాలామంది వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు, సామాన్య ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతుండటంతో జగన్ కోటలో బీటలు వారుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని ఎలాగైనా గెలిచి జగన్ సొంత నియోజకవర్గంలోనే ఆయనకు రాజకీయంగా పెద్ద షాక్ ఇవ్వాలని కూటమి కూకటివేళ్లతో కష్టపడుతోంది.

# వారసులొస్తున్నారు.....

విజయవాడ, ఆగస్టు 29, ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైంది ఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది. అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్

విజయవాడ, ఆగస్టు 29, విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు. చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటళ్లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్? కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

## రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

**- ముఖ ద్వారం నుంచి రాఘవేంద్ర స్వామి మఠం వరకు ఏర్పాట్ల పరిశీలన..**



విభారే న్యూస్ ఆగస్టు 29 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఆలయంలో అమ్మవారి దర్శనం అనంతరం నిఘా నేత్రాల పరిశీలన చేసిన ఎస్పీ.ఆగష్టు 27 నుండి సెప్టెంబర్ 2 వరకు కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్ర స్వామి 355 వ సప్తరాత్రోత్సవాలలో భాగంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ భద్రత ఏర్పాట్లను, ఆలయ పరిసరాలను శనివారం పరిశీలించారు. ఫాల్కన్ వాహనం,డ్రోన్ కెమెరాలు,బాడీ ఒన్ కెమెరాలు,సిసి కెమెరాల వంటి తదితర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాదాపు 300 మంది పోలీసు బలగాలతో ఉత్సవాలలో భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేశామన్నారు.అనంతరం శ్రీమఠంలో క్యూ లైన్,దేవాలయ ప్రాకారం, తుంగ భద్ర నది తీర పరిసర ప్రాంతాలను పరిశీలించారు.సప్తరాత్రోత్సవాల ఏర్పాట్ల గురించి మఠం సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి జిల్లా ఎస్పీకి వివరించారు.జిల్లా ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు , మంత్రాలయం సిఐ దస్తగిరి,సీఐ రామంజులు,శ్రీ మఠం అధికారులు ఉన్నారు.

## సాగునీటి కోసం సెప్టెంబర్ 1న ధర్నా--

**వెలుగోడు రిజర్వాయర్ వద్ద రైతులతో భారీ నిరసన: శిల్పా--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఆగస్టు 29: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి విమర్శించారు. నంద్యాలలోని తన నివాసంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతులకు గిట్టుబాటు ధరలు, సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాయలసీమ




రైతాంగ సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1న సాగునీటి సాధన కోసం వెలుగోడు రిజర్వాయర్ వద్ద నిర్వహించే భారీ ధర్నాలో రైతులు, రైతు సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రైతుల సమస్యలపై సమావేశంలో అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకులు అరికట్ల శివరామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషకు లయన్స్ సత్కారం--

**సాహితీవేత్త రమణమూర్తి, ఉపాధ్యాయుడు వెంకటకృష్ణకు పురస్కారాలు--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 29: గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శారదా విద్యాపీఠం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు సౌజన్యంతో జరిగిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షత వహించారు. గిడుగు



రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ రచయిత, సాహితీవేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణమూర్తి, శారదా విద్యాపీఠం ప్రధానోపాధ్యాయులు, తెలుగు భాషా ఉపాధ్యాయులు వెంకటకృష్ణలకు తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, రీజనల్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ (పట్టణ నిరాశ్రయుల వసతి గృహం)ఆధ్వర్యంలో ఘనంగా విశ్వమాత మదర్ తెరిసా జన్మదిన వేడుకలు...



విభారే న్యూస్ ఆగస్టు 29 ఎమ్మిగనూరు..పట్టణంలోని స్థానిక ఆది ఆంధ్ర పాఠశాల పక్కన విశ్వమాత మదర్ తెరిసా జన్మదిన వేడుకలు వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సంస్థ డైరెక్టర్ సునీల్ కుమార్ ప్రముఖులంతా కలిసి మదర్ తెరిసా విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ముందుగా పాస్టర్ యెహోషువ వాక్య పఠనం ప్రార్థనతో ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. అనంతరం వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కదిరికోట సునీల్ కుమార్ మాట్లాడుతూ విశ్వ మానవాళికి ప్రేమ, కరుణ, త్యాగానికి మారుపేరుగా నిలిచి రోగులకు ముఖ్యంగా కుష్టు రోగులకు తను సేవలు చేసి ప్రతి ఒక్కరి హృదయాల్లో అమ్మగా కొలువుతీరిన మనిషి మదర్ తెరిసా అని కొనియాడారు. అందుకే ఆమెను అందరూ కూడా మదర్ తెరిసా అని పిలుస్తారని పేర్కొన్నారు. అలాగే నేను కొందరి మిత్రులతో కలిసి 1998వ సంవత్సరంలో మదర్ తెరిసా ను స్ఫూర్తిగా తీసుకొని నిర్మల్ హృదయ్ అనే అనాథ ఆశ్రమమును స్థాపించి ఎందరో అనాథలను అక్కున చేర్చుకొని వారికి కూడు, గూడు, బట్ట, అందించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే రోడ్డుపై ఉన్న యాచకులకు, మతిస్థిమితం లేని వారికి ఆహార పొట్లాలను పంచుతూ మొబైల్ సర్వీస్ ద్వారా కూడా సేవలను అందించామని గుర్తు చేశారు. ఉచిత అంబులెన్స్ సర్వీసును కూడా అందించామని పేర్కొన్నారు.తమ ఆశ్రమంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, పిల్లలు వదిలివేసిన తల్లిదండ్రులను, భార్యలు వదిలేసిన భర్తలను,భర్తలు వదిలేసిన భార్యలను, ఇంకా దిక్కులేని వారికి తమ ఆశ్రమంలో చోటు కల్పించి వారిని కుటుంబ సభ్యుల్లా అక్కున చేర్చుకుంటామని పేర్కొన్నారు.వయసు మీరి చనిపోయిన వారికి సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా ఏ లోటు రాకుండా వారి అంత్యక్రియలను పక్కనే ఉండి జరిపించామని చెమ్మగిల్లిన కళ్ళతో గత సంఘటనలను గుర్తు చేసుకున్నారు.ఇకపై కూడా మదర్ తెరిసా చేసిన సేవలు స్మరించుకుంటూ ఆమె చూపిన ప్రేమ,సేవ అనే బాటలో పయనిస్తూ తమ సేవలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. సునీల్ కుమార్ ఆహ్వానం మేరకు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎమ్మిగనూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవి కళాధర్ శర్మ మాట్లాడుతూ ఎక్కడో యుగోస్లేవియా లో పుట్టి భారతదేశానికి వచ్చి కలకత్తాలో స్థిరపడి రోగులకు మరి ముఖ్యంగా కుష్టురోగులకు ఆమె చేసిన సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. ప్రేమను పంచి, సేవ గుణంలో తనకు సాటి ఎవరూ లేరని నిరూపించుకున్నారన్నారుఅందుకే ఈమెను విశ్వమాతగా పేర్కొంటారని ఆయన అన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు బైలుప్పల షఫీ ఉల్లా,విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు దొరయ్య,మాల నరసన్నలు ఆమెను గూర్చి ఆమె చేసిన సేవలను గూర్చి మాట్లాడారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అందరికీ పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సిహెచ్ రవి కళాధర్ శర్మ,కె.ఆర్ నటరాజ్ రెడ్డి,మాచాని వెంకటేష్,మాచాని సోమేశ్, మాచాని రఘు,కళాకారుల సంఘం సభ్యుడు బైలుప్పల షఫీ ఉల్లా, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు దొరయ్య, ఎస్ బి ఐ సీనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్,ఎల్ఐసి అడ్వైజర్ సప్పోగు ప్రభాకర్, ఏపీ దేవదానం,మాల నరసన్న,పార్లపల్లి జయన్న,బిసిఆర్ఎఫ్ అధ్యక్షులు అజిత్ కుమార్,రిపోర్టర్ లు ప్రసన్న, భీమన్న లు,మద్రి ప్రభాకర్, ఎం డేవిడ్, శాంతి రాజు,దొరబాబు, సందీప్ కుమార్,మేషక్,విష్ణు, వృద్ధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి..

**- ఫేక్ టి సి లు,బోగస్ అటెండెన్స్, ఆహార నాణ్యత, అనుమతులపై నిగ్గు తేల్చాలి: ఎస్ఎఫ్ఐ**



విభారే న్యూస్ ఆగస్టు 29 ఎమ్మిగనూరు..విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్‌పై వస్తున్న పలు ఆరోపణలపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) జిల్లా ఉపాధ్యక్షులు రాము,(ఏఐఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున, (డివైఎఫ్ఐ) పట్టణ కన్వీనర్ విజయ్ డిమాండ్ చేశారు. గ్రామీణ, పేద, బడుగు?బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి అందించేందుకు ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలు పూర్తిగా పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో గత కొన్ని సంవత్సరాల ప్రవేశాలపై అనుమానాలు ఉంటే వాటిని అధికారిక రికార్డుల ఆధారంగా నిగ్గు తేల్చాలని కోరారు. ప్రవేశం పొందిన విద్యార్థుల టి సి లు, అడ్మిషన్ రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లు, యూ డైస్+ వివరాలు, బోనఫైడ్, స్టడీ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ నవోదయ ప్రవేశాలకు అర్హత సాధిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హాజరు నమోదవుతున్న విద్యార్థులు వాస్తవంగా ఎక్కడ ఉంటున్నారో అధికారులు నిర్ధారించాలని కోరారు. పాఠశాల హాజరు రికార్డులను కోచింగ్ సెంటర్, హాస్టల్ వివరాలతో సరిపోల్చి పరిశీలించాలని సూచించారు. ఒకే విద్యార్థి వేర్వేరు ప్రాంతాలు లేదా పాఠశాలల వివరాలతో దరఖాస్తు చేశాడా అనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. ఫేక్ లేదా అనుమానాస్పద టి సి లు ఉన్నట్లు తేలితే వాటి మూలాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాజా భాష ప్రైవేట్ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై కూడా శాఖాపరమైన విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రైవేట్ కోచింగ్ నిర్వహించేందుకు నిబంధనల ప్రకారం అనుమతి ఉందా లేదా అధికారులు స్పష్టం చేయాలని అన్నారు. కోచింగ్ నిర్వహణ, ఫీజుల వసూళ్లు, విద్యార్థుల చేరికలు తదితర అంశాల్లో ఆయన పాత్రను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలని కోరారు. కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో నవోదయలో ఎంపిక అవుతున్నారనే ప్రచారం నేపథ్యంలో గత సంవత్సరాల ఎంపిక వివరాలను కూడా పరిశీలించాలని అన్నారు. పరీక్షా కేంద్రాలు, ఇన్విజిలేటర్ల నియామకాలు, ఎంపికైన విద్యార్థుల పూర్వ పాఠశాలల వివరాలను పరిశీలించి ఏమైనా అక్రమాలు జరిగాయా తేల్చాలని డిమాండ్ చేశారు. పరీక్షా ప్రక్రియలో అనుచిత సహకారం జరిగిందనే ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా లేదా స్వతంత్రంగా విచారణ చేయాలని కోరారు. ఆరోపణలను ముందుగానే నేర నిర్ధారణగా పరిగణించకుండా వాస్తవాలను ఆధారాలతో వెలుగులోకి తేవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ హాస్టల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు వారు తెలిపారు. తనిఖీలో వంటగది, స్టోర్, ఆహార పదార్థాలు, కూరగాయల నిల్వ తదితర అంశాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యత లేని బియ్యం, కారం, ఇతర సరుకులతో ఆహారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. కూరగాయలను పరిశుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేస్తున్నారా లేదా అధికారులు నిర్ధారించాలని కోరారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించిన నమూనాల పరీక్షా ఫలితాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతున్నదా లేదా పరిశీలించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. హాస్టల్‌లో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వంటగది పరిశుభ్రత వంటి అంశాలపై కూడా తనిఖీ జరపాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కోచింగ్, హాస్టల్ పేరుతో సుమారు రూ.8,000 వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై పూర్తి వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వసూలు చేస్తున్న ఫీజులకు రసీదులు ఇస్తున్నారా లేదా అధికారులు తనిఖీ చేయాలని కోరారు. హాస్టల్, కోచింగ్ నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ, శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ, భవన వినియోగ అనుమతులను అధికారులు ధృవీకరించాలని కోరారు. అవసరమైన అనుమతులు లేకుండా విద్యార్థులను హాస్టల్‌లో ఉంచుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తనిఖీకి వచ్చిన సమయంలో విద్యార్థులను వాష్‌రూమ్ ప్రాంతంలో దాచారనే ఆరోపణలు కూడా తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఆ ఘటనపై విద్యార్థులు, సిబ్బంది, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించి నిజానిజాలు తేల్చాలని కోరారు. విద్యార్థులను అనుచితమైన లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉంచినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు వ్యాపార వస్తువులు కాదని, వారి ఆరోగ్యం, భద్రతతో చెలగాటం ఆడే హక్కు ఎవరికీ లేదని రాము, దేవన్ ఘాటుగా పేర్కొన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నవోదయ సీట్లు నిజమైన అర్హులైన విద్యార్థులకు దక్కేలా ప్రవేశ వ్యవస్థను పారదర్శకంగా చేయాలని కోరారు. ఫేక్ టి సి లు, బోగస్ హాజరు లేదా తప్పుడు రికార్డులు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్ రూల్స్ ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆధారాలు లభిస్తే సంబంధిత దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ చేపట్టాలని కోరారు. అవసరమైతే ఏసీబీ, లోకాయుక్త వంటి సంస్థల దృష్టికి అంశాన్ని తీసుకెళ్లాలని అన్నారు. విద్యార్థుల హక్కులు, ఆరోగ్యం, భద్రతపై బాలల హక్కుల పరిరక్షణ అధికారుల ద్వారా కూడా పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్, డి ఈ ఓ తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఫుడ్ సేఫ్టీ, విద్యాశాఖ, రెవెన్యూ, బాలల హక్కుల సంబంధిత అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని అన్నారు. విచారణలో వెలువడే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేద, గ్రామీణ విద్యార్థులకు దక్కాల్సిన నవోదయ అవకాశాలు ఎలాంటి అక్రమాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్‌పై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు శివ, దేవాన్ష్, బద్రి, వీరేంద్ర, ఐసా అశోక్ జిల్లా కో కన్వీనర్ తదుపరులు పాల్గొన్నారు

## రేపు సంకష్టహర చతుర్థి సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ ఆగస్టు 29 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త..శ్రీ శ్రీ శ్రీ గణపతి



సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామి వారికి మహా సంకష్టహర చతుర్థిప్రదోష పూజ సోమవారము నాడు నిర్వహించబడును.వరసిద్ధి వినాయక స్వామి వారి ఈ వ్రతాన్ని ఆచరిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన విఘ్నాలు రావు మరియు మీ జాతకం లో బుధ,కేతు గ్రహాలు కలిగించు ఆటంకాలు తొలగిపోయి శుభ ఫలితాలను ప్రసాదించును.స్వామి వారికి ఈ రోజున ఉదయం 10:30 గం"లకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహితముగా గణపతి హోమం జరుగును. సాయంకాలము 6:00 గంటలకు పంచామృత అభిషేకం,సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ జరుగును. ఇందు భక్తులు విశేషముగా పాల్గొని శుభ ఫలితాలు పొందగలరు. సంకటహర చతుర్థి ప్రదోష పూజ 200 /-హోమ సంకల్పం 116 /- విశేషంగా ప్రధాన హోమం 2500/-వివరములకు సంప్రదించవలసిన నెం:-జి.ప్రద్యుమ్న కుమార్ శర్మ9440616198 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**